# ఇప్పుడెక్కడ మెయిల్!......

ఆ రోజు ఆదివారం.

మరునాడుకల్లా నేను బందరు స్కూలు వేళకు చేరాలె. ఆ రోజు మెయిలులో ప్రయాణం చేస్తేనే నేను మరునాడు బడికి వేళకు వెళ్ళగలను. ఆ బండి తప్పితే నేను చాలా చిక్కులలో పడటం జరుగుతుంది.

మెయిలు తెల్లవారుఝామున నాలుగింటికి వస్తుంది తెనాలికి. నేను ఇంటిదగ్గర రెండున్నరకు గాని మూడింటికి గాని బయలుదేరి మెయిలు సులభంగా అందుకోవచ్చు.

అయితే నాకో భయం వేసింది మూడింటికి మెళకువ వస్తుందో రాదోనని :మా ముసలావిడ నేను లేపుతాను, మీకేమి భయంలేదు అన్నది కాని నేను ఆమె మాట వినలేదు. గడియారము లేదు. ఆమెగారికి సరిగ్గా మెళకువ వస్తుందని నమ్మకమేమిటి? ఒకవేళ కర్మంజాలక ఆవిడకు మెలకువ రాకపోతే ఏం కావాలె. అని ఇల్లాగ ఆలోచించి, ఎందుకైనా మంచిది వెళ్ళి స్టేషనులోనే కూర్చుందామని ఇంటిదగ్గర నుంచి బయలుదేరాను.

తీరా బయలుదేరిపోతూ దార్లో కాఫీ హొటలులో చూద్దునుగదా పదకొండే అయింది!

అప్పుడు ఏం జేసేది?

మళ్లీ ఇంటికి వెళ్ళటానికి బుద్ధిపుట్టలేదు. యకాయకీని స్టేషనుకు వెళ్లేను. అప్పటికి ఎంత అయిందో చూద్దామని స్టేషను మాస్టరు గదిలోకి వెళ్లాను. అక్కడ గడియారం ఉందిగాని, అది చెడిపోయింది కామాలు. దాని ముఖంపైన కాగితం ముక్కలు అంటించి ఉన్నాయి. స్టేషనులో ఇంకెక్కడా గడియారం లేదు.

స్టేషను మాస్టరు అక్కడేదో పనిచేసుకొంటూన్నాడు. నేను వెళ్ళి అయ్యా, ఇప్పుడెంత అయిందండీ? 'స్టేషనులో గడియారం లేదు. పదకొండున్నర అయి ఉంటుందండి' అన్నాడాయన.

మీకు గడియారం లేకుండా ఎట్లా జరుగుతుందండీ అని నేను అడిగాను. ఆయన ముఖం కోపంగా పెట్టి నీకెందుకయ్యా ఆ సంగతి అంతా? అన్నాడు.

నేను ఎంతో సానుభూతిని చూపాలని ప్రయత్నంచేస్తే అతడు గ్రహించలేదే అని మాత్రం విచారపడ్డాను. అంతేకాని ఆయన కటువుగా మాట్లాడినందుకు నేను పోట్లాట పెట్టుకోలేదు. అయితే మెయిలు ఎన్నింటికి వస్తుందడీ? అని అడిగాను.

ఇప్పుడెక్కడ మెయిలయ్యా? ఎప్పుడో తెల్లవారుఝామున నాలుగింటికి వస్తుంది అన్నాడాయన కొంచెం విసుగుగా.

సరేనని నేను అవతలకు వెళ్ళిపోయినాను. కాసేపు అవీ, ఇవీ చూస్తూ తిరిగాను. ఏమీ తోచలేదు. గేటు తీసే ఉన్నది. ప్లాట్‌ఫారంమీది కెళ్ళి బెంచీమీద కూర్చున్నాను. పిండారబోసినట్లు చక్కని వెన్నెల. ప్రాణాన్ని హాయిగొలిపే చల్లని గాలి వీస్తున్నది. ఆ చంద్రబింబం కేసి చూస్తూ, ఆ సౌందర్యాన్ని చూచి ఆనందిస్తూ కాసేపు గడిపాను.

అప్పటికి పన్నెండు అయి ఉంటుంది. ఇంకా నాలుగు గంటలు గడవాలె. ఈ నాల్గు గంటలో మేకులాగ అల్లాగ కూర్చుని ఉండటం చాలా కష్టం. కాస్త నడుము వాల్చి ఒక్క కునుకు తీస్తే నేమి? నిద్రపట్టి మెలకువ రాదేమోనని భయం వేసింది.

మెయిల్ బండి ధన్, ధన్‌మని పెద్ద మోత చేస్తూ వస్తుంది కదా; నాకు మెలకువ రాకుండా ఎల్లాగ ఉంటుంది. అంత మొద్దు నిద్రా నాది? అనుకున్నాను.

అనుకొని ఆ బెంచీపై పడుకొన్నాను. కాని సరిగ్గా నిద్రపట్టలేదు. ఒక పక్కన భయము. మరునాడు స్కూలుకు పోయి తీరాలె. సెలవల ఆఖరున స్కూలు తెరిచేరోజు అది.

ఆ రోజున స్కూలుకు హాజరు కాకపోతే, సెలవల జీతం అంతా పోతుంది. ఈ భయంతో నిద్ర పట్టలేదు చాలాసేపు.

కళ్ళు తెరుస్తూ మూస్తూ పడుకొన్నాను. ఎప్పుడు నిద్రపట్టిందో నాకు తెలియదు. ఎంతసేపు నిద్రపోయినానో తెలియదు. గబుక్కున లేచి కిటికీ వద్దకు వెళ్ళాను. స్టేషను మాస్టరు ఏదో పని చేసుకొంటున్నాడు. వెళ్ళి అడిగాను. 'సార్, టైము ఎంత అయిందండీ?' అని.

ఇంకో మాట కూడా అన్నాను, 'ఇక్కడ గడియారం లేకపోవటం మూలాన మిమ్ములను అడగవలసివస్తున్నదీ' అని క్షమాపణాపూర్వకంగా, ఈ దఫా అతదేమీ విసుక్కోలేదు. మర్యాదగానే అన్నాడు 'ఇప్పుడెక్కడ మెయిల్ అండీ!' అని

అప్పటికి టైము ఎంత అయిందో తెలియదు. ప్లాట్‌ఫారంమీద కొద్దిమంది జనం ఉన్నారు. చాలామంది పక్కలు పరచుకొని పడుకొని ఉన్నారు. ఆకాశంవంక చూచి నా బుద్ధినంతా వినియోగించి అప్పటికి ఒంటిగంటకంటే ఎక్కువ అయి ఉండదని నిశ్చయించుకొన్నాను.

నిద్ర ముంచుకొస్తున్నది. ఇంకా చాలా టైము ఉంది. అందుకని మళ్లీ పడుకోవలెనని బుద్ధి పుట్టింది, పడుకున్నాను. ఒక్క కునుకుపోయి చటుక్కున లేచివెళ్ళి మళ్లీ అడిగాను స్టేషను మాస్టరును 'ఏమండీ మెయిల్ ఎప్పుడు వస్తుంది?' అని.

'ఇప్పుడేగదయ్యా వచ్చి అడిగావు! ఇవ్వాళ మెయిల్ లేటుగా కూడా వస్తుంది. ఇప్పుడెక్కడ మెయిల్, పోయి పడుకోవయ్యా!' అన్నాడు ఆయన.

అప్పటికి మహా అయితే రెండు అయి ఉంటుందో, ఇంకా తక్కువేమోనని ఊహ కలిగింది.

రైలు వస్తే జనం అంతా లేవటం, కేకలు వేయటం జరుగుతుంది గదా, ప్లాట్‌ఫారంమీదే ఉండి మేల్కో లేకపోతానా అని అనుకొని మళ్ళీ పడుకొన్నాను.

కాసేపటికి మళ్లీ ఉలిక్కిపడి లేచాను. ప్లాట్‌ఫారంమీద జనం అట్లాగే ఉన్నారు. కాని దగ్గర దగ్గర నాల్గు అయిందేమోనని అనుమానం కలిగింది.

మళ్లీ వెళ్ళి స్టేషను మాస్టరును అడిగాను 'మెయిల్ టైము అయిందండీ!' అని. ఆయన నా ముఖంవంక తేరిపారజూచి 'మళ్ళీ వచ్చావ్? ఇప్పుడెక్కడ మెయిల్ అయ్యా. పో!' అని విసుక్కొని నవ్వుకొన్నాడు, పల్లెటూరివాడివలె మాటిమాటికి వచ్చి అడుగుతున్నానని కాబోలు నవ్వుతున్నాడు అయన! పోనీలే! అనుకొన్నాను.

మళ్ళీ వచ్చి బెంచీపైన కూర్చున్నాను. ఇక నిద్రపోదల్చులకోలేదు. తెల్లవారుతూ ఉన్నట్టుగా ఉంది. ఇంకా మెయిల్ రాకపోవటం ఏమిటి? లేటు కాబట్టి ఇంకా కాసేపటిలో వస్తుందనుకొని అక్కడే కూర్చున్నాను.

ఫ్లాట్‌ఫారంమీద పడుకొన్న వాళ్లు ఎవ్వరూ లేవలేదు. ఇవ్వాళ మెయిల్ చాలా లేటు అయి ఉంటుంది అనుకొని ఒక అరగంటసేపు అల్లాగే కూర్చుని ఉన్నాను.

ఎప్పటికి గంట కొట్టరు!

బాగా తెల్లవారుతున్నది. మెయిల్ లేటు అయితే మటుకు ఇంకా రాకుండా ఉంటుందా అని భయంవేసింది.

మళ్లీ వెళ్ళి అడిగాను 'ఏమి సార్ మెయిల్ టైము ఇంకా కాలేదండీ?'

స్టేషను మాస్టరు పూర్వంలాగే 'ఇప్పుడెక్కడ మెయిల్ అయ్యా, వెళ్లు' అన్నాడు.

ఇప్పుడెక్కడ మెయిల్ అంటాడు. ఎప్పటికి మెయిల్!

ఎన్ని గంటలు లేటు!!

ఈ విషయాలన్నీ తెలుసుకొందామని 'మెయిల్ ఎన్ని గంటలకు వస్తుందండీ' అని అడిగాను.

వస్తుందయ్యా, దాని టైము ప్రకారం అది వస్తుంది అన్నాడు.

ఈ జవాబులు చూస్తే నాకు కాస్త కోపం వచ్చింది. నాయందు గౌరవంతో మాట్లాడుతున్నట్లు లేదు. అందుకని కాస్త కోపంగానే అన్నాను. 'దాని టైముకే వస్తుంది లెండి, ఆ సంగతి తెలియక పోలేదు. కాని ఇవ్వాళ దాని టైము ఎప్పుడూ అని అడుగుతున్నాను.'

ఆయనా కోపంగా అన్నాడు. 'చిత్తం, ఇవ్వాళ ఇంకా మెయిల్ ఏమిటయ్యా రేపు తెల్లవారుఝామున నాలుగు గంటలకయ్యా కలకత్తా మెయిల్. ఇప్పుడెక్కడ మెయిల్ అయ్యా పో' అన్నాడు.

('ఆనందవాణి' వారపత్రిక, 29.2.1948)